ప్రజాశక్తి

ఆదివారం 6 అక్టోబర్ 2024   8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా







విజయవాడ - కుప్పం ఆర్‌టిసి సర్వీసులు ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ డిపో నుండి అధునాతన హంగులతో కూడిన రెండు నూతన ఇంద్ర బస్సులను రాష్ట్ర ఎక్సైజ్, ఖనిజ వనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఎపిఎస్ ఆర్‌టిసి చైర్మన్ కొనకళ్ల నారాయణరావు శనివారం ప్రారంభించారు. ఈ నూతన ఇంద్ర బస్సులు విజయవాడ – కుప్పం మధ్య నడుస్తాయి. ప్రతి రోజూ విజయవాడలో రాత్రి 8.10 గంటలకు, కుప్పంలో సాయంత్రం 5.30 గంటలకు బయలు దేరతాయి. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆర్‌టిసి ఎగ్జికుటివ్ డైరెక్టర్ కె.ఎస్. బ్రహ్మానంద రెడ్డి, ఎన్‌టిఆర్ జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.వై.దానం, ఆర్‌టిసి అధికారి శర్మ తదితరులు పాల్గొన్నారు.



బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి కొల్లు, ఆర్‌టిసి చైర్మన్ కొనకళ్ల

టిడిపి రాష్ట్ర కార్యాలయంలో

తిరువూరు పంచాయితీ

- నేడు పార్టీ శ్రేణులతో సమావేశం
- సమావేశాన్ని బహిష్కరిస్తున్నాం : సర్పంచ్ తుమ్మల
- పార్టీలో విభేదాల్లేవు : ఎంపి శివనాథ్
- ఇక జాగ్రత్త వహిస్తా : ఎంఎల్ఎ కొలికపూడి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో, తిరువూరు : మంగళగిరిలోని టిడిపి రాష్ట్ర కార్యాలయంలో శనివారం తిరువూరు నియోజకవర్గ నేతల్లో నెలకొన్న విభేదాలపై 'పంచాయితీ' జరిగింది. నియోజకవర్గంలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలపై శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావుతో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ యాదవ్, విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, మాజీ ఎంఎల్‌సి మంతెన సత్యనారాయణ రాజు సమావేశమయ్యారు. ఎంఎల్ఎ కొలికపూడిపై టిడిపి తిరువూరు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు చేసిన ఫిర్యాదులకు పార్టీ అధిష్టానం ఎట్టకేలకు 10 రోజుల అనంతరం అధిష్టానం స్పందించింది. మంగళగిరిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయానికి ఎంఎల్ఎను పిలిపించి ఆయనపై వచ్చిన ఫిర్యాదుల గురించి వివరణ అడిగినట్లు తెలిసింది. పార్టీ నాయకుడు, చిట్టేల సర్పంచ్‌పై ఆయన చేసిన అనుచిత చేసిన వ్యాఖ్యలు, మహిళలపై లైంగిక వేధింపుల వ్యవహారాలపై నియోజవర్గంలోని ఆపార్టీ నాయకులు మంగళగిరిలోని రాష్ట్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ యాదవ్‌కు ఇటీవల ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఎంఎల్ఎ కొలికపూడి నాయకత్వంలో తాము పని చేయలేమని, అందరినీ అవమానించడం, సమస్య చెప్పిన వారందరినీ పోలీస్ స్టేషన్లో పెట్టడం వంటి చర్యలతో తాము ఇబ్బందులు పడు తున్నామని నియోజకవర్గ నేతలు ఫిర్యాదు చేశారు. తమకు పార్టీ ఇన్చార్జిని నియమించాలని అధిస్థానానికి ముక్తకంఠంతో విజ్ఞప్తి చేశారు. ఈనేపథ్యంలో నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉండాలని పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శావల దేవదత్తును పార్టీ అధిష్టానం ఆదేశించి ఆయనతో తిరువూరులోనే పార్టీ నియోజవర్గ కార్యాలయాన్ని ఏర్పాటు చేయించారు. అలాగే జర్నలిస్టులపై(మిగతా 2లో)









సామాన్యులకు సంతృప్తికరంగా దుర్గమ్మ దర్శనం

కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి - విజయవాడ, అర్బన్ : ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో వైభవంగా దుర్గా నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. శనివారం దసరా ఉత్సవాలను కలెక్టర్ సృజన, ఎన్‌టిఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు పరిశీలించారు.



తాగునీరు, పాలు తదితరాల పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ జి.సజన శ్రీ అన్నపూర్ణాదేవి అలంకత అమ్మవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వదించి అమ్మవారి శేష వస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు. ఈసందర్భంగా కలెక్టర్ సృజన మాట్లాడుతూ సామాన్య సందర్శకులకు సంతప్తికరంగా దుర్గమ్మ దర్శనం లభించేలా చేసిన ఏర్పాట్లు మంచి ఫలితాలు ఇస్తున్నాయని చెప్పారు. ఎవరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలందించాలని వివిధ శాఖల అధికారులకు సూచించారు.

స్వర్ణ దీపిక మాసపత్రిక వార్షికోత్సవం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విజయవాడ సమీపంలోని తాడేపల్లి ఐరా ఫంక్షన్ హాల్‌లో శనివారం స్వర్ణ దీపిక మాసపత్రిక వార్షికోత్సవం జరిగింది. ఎడిటర్ బెల్లంకొండ శివాజీ రాజా ఆధ్వర్యాన జరిగిన ఈ వార్షికోత్సవంలో ఆరాధన టివి సిఇఒ పాల్ దేవప్రియం పుల్లా మాట్లాడుతూ రాష్టంలో క్రైస్తవులంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆధ్యాత్మిక సువార్త సేవతో పాటు సామాజిక, ఆర్థిక రంగాల్లో ప్రావీణ్యత సాధిస్తేనే రాజ్యాంగ హక్కులు కాపాడుకోగలుగుతామని అన్నారు. కొడాలి విజయ్ మాట్లాడుతూ క్రైస్తవులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు గ్రామ స్థాయి పేద క్రైస్తవులకు అందించేందుకు క్రిస్టియన్ పత్రికలు కషి చేయాలన్నారు. అందుకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ ధర్మ పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షులు జెరూసలేం మత్తయి, దళిత్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ మామిడి సుదర్శన్, 500 మందికి పైగా క్రైస్తవ సోదర సోదరీమణులు పాల్గొన్నారు.





విజయవాడ బాలోత్సవ భవన్లో సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, ఆంధ్ర ప్రజా నాట్యమండలి నాయకులు జగన్, అనిల్, ఐవి తదితరులు

జూన్‌కు కొత్త టెర్మినల్ సిద్ధం

ఎంపిలు బాలశౌరి, కేశినేని

ప్రజాశక్తి - గన్నవరం : విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం కొత్త టెర్మినల్ నిర్మాణం వచ్చే జూన్‌కు అందుబాటులోకి తీసుకొస్తామని ఎఎసి చైర్మన్, మచిలీపట్నం ఎంపి వల్లభనేని బాలశౌరి, ఎఎసి వైస్ చైర్మన్, విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ తెలిపారు. గన్నవరంలోని విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో శనివారం ఎయిర్ పోర్ట్ అడ్వైజరీ కమిటీ సమావేశం జరిగింది. సమావేశం అనంతరం బాలశౌరి, కేశినేని మీడియాతో మాట్లాడుతూ 2025 జనవరికి కాంక్రీట్ పనులు పూర్తవుతాయని, అనంతరం ఇతర పనులు పూర్తి చేసి జూన్‌కు నూతన టెర్మినల్ భవనాన్ని అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రారంభించిన విమాన సర్వీసులన్నీ పూర్తి ఆక్యుఫెన్సీతో నడుస్తున్నాయని తెలిపారు. దేశంలోని పుణ్యక్షేత్రాలు, వాణిజ్య నగరాలకు కనెక్టివిటీ పెంచేందుకు కషి చేయాలని ఎయిర్ పోర్ట్ అథారిటి కమిటీకి లేఖ రాసినట్లు తెలిపారు. పోలీసు, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా కొత్త టెర్మినల్‌లో నెలకొన్న సమస్యలపై సమీక్ష జరిపి పరిష్కరిస్తాయని తెలిపారు. విమానాశ్రయంలో ప్రయాణీకుల సౌకర్యార్థం క్యాబ్ సర్వీసును అందుబాటులోకి



తీసుకురావాలని ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ లక్ష్మీకాంత్ రెడ్డికి సూచించారు. అలాగే అధికారులతో మాట్లాడి ఆర్‌టిసి బస్సు సర్వీసు కూడా నడిపే విధంగా కషి చేయాలన్నారు. విమానాశ్రయంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కృష్ణా, గోదావరి నదుల నీటిని తీసుకొచ్చే అంశాన్ని కూడా సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. ఇక్కడ నుంచి దుబాయ్‌కి ఎమిరెట్స్ విమాన సర్వీసులు ప్రారంభించాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కోరినట్లు తెలిపారు. 2029 నాటికి ఇక్కడి నుండి న్యూయార్క్‌కు నేరుగా విమాన సర్వీసు ప్రారంభించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో కృష్ణాజిల్లా కలెక్టర్ డికె.బాలాజీ, ఎస్‌పి ఆర్.గంగాధర్ , కమిటీ సభ్యులు బాలగంగాధర్, పొట్లూరి బసవరాజు, ముప్పా గోపాల కష్ణ, షేక్ మొహిద్దీన్, జోగులాంబ, పుట్టుగుంట వెంకట సతీష్ తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల్లో లోటుపాట్లు లేకుండా చూడాలి : ధ్యానచంద్ర

ప్రజాశక్తి-విజయవాడ : దసరా ఉత్సవాల్లో ఎటువంటి ఆటంకాలు లేకుండా చూసుకోవాలని, నగరాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఆయన శాఖాధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నగరంలో పర్యటించి ఏర్పాట్లు పర్యవేక్షించారు.





మీడియాతో మాట్లాడుతున్న ఎంపి శివనాథ్, చిత్రంలో ఎంఎల్ఎ కొలికపూడి

టిడిపి రాష్ట్ర కార్యాలయంలో తిరువూరు 'పంచాయితీ'

(మొదటి పేజీ తరువాయి)

ఎంఎల్ఎ చేసిన వ్యాఖ్యలపైనా పాత్రికేయులు ముఖ్యమంత్రికి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడికి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎంఎల్ఎ కొలికపూడిని పార్టీ రాష్ట్ర కార్యాలయానికి పిలిపించి మాట్లాడడం అందరిలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. పార్టీ అధిష్టానానికి ఎంఎల్ఎ కొలికపూడి ఏమీ వివరణ ఇచ్చారో తెలియదుగాని తనవల్ల కొందరికి ఇబ్బందులు వస్తాయని ఊహించలేదని, తనవల్ల వచ్చిన సమస్యను సరిచేసుకుంటానని ఎంఎల్ఎ చెప్పినట్లు టిడిపి సోషల్ మీడియాలో వార్తలు హల్‌చల్ చేస్తోంది.

విభేదాల్లేవు...సర్దుకుని ముందుకెళ్లడమే అలవాటు : ఎంపి శివనాథ్

అనంతరం ఎంపి కేశినేని శివనాథ్ మీడియాతో మాట్లాడుతూ పార్టీలో కూడా కొన్ని సమస్యలుంటాయని, అవి కూర్చొని మాట్లాడుకుంటే పరిష్కారవుతాయని అన్నారు. టిడిపిలో ఎలాంటి విభేదాలుండవని, ఉన్నా సర్దుకుని ముందుకెళ్లడమే అలవాటని పేర్కొన్నారు. సమన్వయ లోపం వల్ల తిరువూరులో చిన్న సమస్యలొచ్చాయని, అవి సర్దుకున్నాయని చెప్పారు. టిడిపి నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్ధేశం చేసేందుకు, పార్టీని బలోపేతం చేసేందుకు, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏవిధంగా పోటీ చేయాలనే అంశాలపై చర్చించేందుకు ఆదివారం తిరువూరులో టిడిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాభివద్ధికి ఓ శ్రామికుడిలా కష్టపడుతున్నారని కొనియాడారు. అలాంటి ముఖ్యమంత్రికి క్యాడర్ వల్ల ఎప్పుడూ ఎలాంటి సమస్యలు, ఇబ్బందులు రాలేదని, ఇకపై కూడా రావని ఎంపి స్పష్టం చేశారు.

పొరపాట్లు జరక్కుండా జాగ్రత్త వహిస్తా : ఎంఎల్ఎ కొలికపూడి

ఎంఎల్ఎ కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీలో కొంత సమన్వయ లోపం వల్ల కొన్ని సమస్యలొచ్చాయని చెప్పారు. ఇకపై అలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకుంటానని పార్టీ పెద్దలకు చెప్పినట్లు తెలిపారు.

నేడు తిరువూరులో పార్టీ శ్రేణులతో సమావేశం

తిరువూరు శ్రీరస్తు కళ్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం టిడిపి నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య తదితర నాయకులు హాజరవుతారని తెలిసింది.

సమావేశాన్ని బహిష్కరిస్తున్నాం : సర్పంచ్ తుమ్మల శ్రీనివాసరావు

తాము ఆదివారం జరిగే సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు ఎంఎల్ఎతో తీవ్ర అనుచిత వ్యాఖ్యలను ఎదుర్కొన్న చిట్టేల సర్పంచ్ తుమ్మల శ్రీనివాసరావు తెలిపారు. ఆ సమావేశానికి తాము వెళ్లబోమని ఆయన స్పష్టం చేశారు.

ఐఎస్ఎ రాష్ట్ర అకడమిక్ చైర్మన్‌గా డాక్టర్ తారకప్రసాద్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఇండియన్ సొసైటీ ఆఫ్ అనస్తీషియాలజిస్ట్స్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అకడమిక్ చైర్మన్‌గా డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్ నియమితులయ్యారు. ఇటీవల తిరుపతిలో జరిగిన సదస్సులో ఆయనను అకడమిక్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా నియమించారు. ఈ కార్యక్రమంలో ఐఆర్‌సిఎఫ్ చైర్మన్ డాక్టర్ ఎస్ఎస్‌సి చక్రరావు, ఐఎస్ఎ పూర్వ జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.ఆర్.ఎన్.ఠాగూర్, డాక్టర్ ఎ.కామేశ్వరరావు, డాక్టర్ కుచేలాబాబు, డాక్టర్ ఎం.వి.భీమేశ్వర్, జిసి సభ్యులు డాక్టర్ కిరణ్, పూర్వ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆళ్ల ప్రశాంతి పాల్గొన్నారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నూతన ఆర్‌డిఒ

మచిలీపట్నం ఆర్‌డిఒగా స్వాతి బాధ్యతల స్వీకారం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : మచిలీపట్నం డివిజన్ రెవెన్యూ డివిజనల్ అధికారిగా కె. స్వాతి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ప్రభుత్వం చేసిన బదిలీల్లో ఇప్పటి వరకు ఇక్కడ ఆర్‌డిఓగా బాధ్యతలు నిర్వహించిన ఎం. వాణి ని ఏలూరు జిల్లా నూజివీడు డివిజన్ కు బదిలీ చేశారు. మచిలీపట్నం నూతన ఆర్ డి ఓ గా బాధ్యతలు చేపట్టిన స్వాతి తొలుత కలెక్టర్ డి. కె. బాలాజిని ఆయన ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందచేశారు.

పిఎం యశస్వి ఉపకారవేతనాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : కృష్ణాజిల్లాలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 9వ, 10వ తరగతి, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుచున్న బిసి, ఇబిసి, సంచార జాతుల కులములకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పి.యం. యశస్వి పథకం కింద ఉపకారవేతనాలు పొందుటకు అర్హత కలిగిన అభ్యర్థుల నుండి ధరఖాస్తులను కోరుతున్నట్లు జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమం, సాధికారత అధికారి,జి.రమేష్ తెలిపారు. అర్హత కలిగిన 9వ, 10వ తరగతి చదువుచున్న విద్యార్థిని, విద్యార్థులు ఈ నెల 15వ తేదీ లోపు మరియు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుచున్న విద్యార్థిని, విద్యార్థులు ఈ నెల అనగా 2024 అక్టోబర్ 31వ తేదీ లోపు ధరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుతో పాటుగా కుల, ఆదాయ, పాటశాల / కళాశాల దవీకరణ పత్రములను ఆన్లైన్‌లో పొందుపరచాలన్నారు. దరఖాస్తు చేసుకొను విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలకు మించరాదన్నారు. పూర్తి వివరములకు https://vet.nta.ac.in వెబ్సైటు ను సందర్శించాలన్నారు.

మోపిదేవి ఎంపిడిఒగా స్వర్ణభారతి



ప్రజాశక్తి మోపిదేవి : మోపిదేవి మండల పరిషత్ అభివృద్ధి అధికారిణిగా స్వర్ణ భారతి శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆమె ఇక్కడ పనిచేసిన అనుభవం ఉంది. మండలంలోని గ్రామపంచాయతీ కార్య దర్శిలు ఆమెకు పుష్ప గుచ్చం అందించి అభినందనలు తెలిపారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు : డిఎస్‌పి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : దసరా నవరాత్రుల సందర్భంగా శక్తి పటాల ఊరేగింపులో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని బందరు డిఎస్‌పి అబ్దుల్ సుభాన్ హెచ్చరించారు. శనివారం ఆర్.పేట పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో డిఎస్పీ అబ్దుల్ సుభాన్ మాట్లాడుతూ శక్తి పటాల ఊరేగింపు కు డీజే పర్మిషన్లు లేవని, అలాగే బాణసంచా కూడా నిషేధం అన్నారు. ఎవరైనా డిజెలు పెట్టిన చర్యలు తీసుకుంటామన్నారు. క్రిమినల్ బ్యాక్ గ్రౌండ్ ఉన్న వారిని ఎవరిని కూడా నిర్వాహకులు ఊరేగింపులకు అనుమతించ వద్దాన్నారు. ఒక ఏరియాకి సంబంధించిన శక్తి పటాలలో బయట వారు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు ఈ శక్తి పటాల ఊరేగింపులో అసాంఘిక కార్యకలాపాలు అనగా రికార్డింగ్ డాన్సులు, హిజ్రాలను తీసుకురావడం వంటి వాటికి అనుమతి లేదన్నారు. ఈనెల రెండో తారీకు రాత్రి మచిలీపట్నం బలరాంపేట శక్తి పటాల వద్ద జరిగిన గొడవలో మూకుమ్మడిగా దాడి చేసి ముగ్గురిని గాయపరిచి ఒక వ్యక్తినీ తీవ్రంగా గాయపరిచిన కేసులో ఇప్పటివరకు 17 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించామన్నారు. ఈ సమావేశంలో ఆర్ పేట సిఐ కె.యేసు బాబు ఉన్నారు.



మాట్లాడుతున్న డిఎస్‌పి అబ్దుల్ సుభాన్

ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా లయన్స్ 100 రోజుల సేవా యజ్ఞం లో భాగంగా స్థానిక లైన్స్ సేవా భవనంలో పలువురు ఉపాధ్యాయులను శనివారం ఘనంగా సన్మానించారు. మండలంలోని చంద్రాల యుపి పాఠశాలలోని పనిచేస్తున్న ఉపాధ్యాయులు, యుటిఎఫ్ మాజీ ప్రధాన కార్యదర్శి కలపాల రత్నం ఎం ఆరోగ్యం, సిహెచ్ శ్రీనివాస్, ఎం స్రవంతి లకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించడం సత్కరించారు. ఈ కార్యక్రమం లో రాయల్స్ క్లబ్ అధ్యక్షురాలు నిమ్మగడ్డ శశికళ, క్లబ్ సభ్యులు నవాబు, వైపీసీ ప్రసాద్, పరంధామయ్య, జంగం మోహనరావు, సుబ్రమణ్యేశ్వరరావు అడుసుమిల్లి రామమోహనరావు, బొప్పన శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మహిళా రక్షణ చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-ఉయ్యూరు : మహిళల రక్షణకు అనేక చట్టాలు అమలులో ఉన్నాయని ఉయ్యూరు జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీహరి అన్నారు. స్థానిక కేసీపీ ఆడిటోరియంలో శనివారం విధాన్ సే సమాధాన్, జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళా న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని మహిళా హక్కులపై మాట్లాడారు. గహహింస నిరోధక చట్టం, లైగింగ వేధింపులు పరిష్కారాలు తదితర అంశాలను స వివరంగా వివరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాగిత గోపీచంద్, జనరల్ సెక్రటరీ గుండు శ్రీకృష్ణకుమార్, న్యాయవాదులు గీతాంజలి, ధనలక్ష్మి, దివ్యాంజలి, మోర్ల అంకశ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీహరి

కొనకళ్ల ప్రమాణ స్వీకారానికి తరలిన నాయకులు

ప్రజాశక్తి-అవనిగడ్డ : ప్రయాణీకులకు మెరుగైన సేవలందించేందుకు ఏపీఎస్‌ఆర్టీసీ నూతన చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు కషి చేస్తారని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరు వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం విజయవాడలో ఏపీఎస్ ఆర్టీసీ నూతన చైర్మన్గా నారాయణరావు ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో అవనిగడ్డ నుంచి టిడిపి నాయకులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ ఆర్టీసీకి మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. కార్మికులు ప్రయాణికుల ప్రయోజనాలే లక్ష్యంగా తమ కూటమి ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బండి కనకదుర్గ, నాగాయలంక మండల టిడిపి అధ్యక్షులు మెండు లక్ష్మణరావు, మేడికొండ విజయ్ పాల్గొన్నారు..

ప్రజాదర్బార్‌లో సమస్యల వెల్లువ

ప్రజాశక్తి-ఉయ్యూరు : ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా శనివారం సాయిపురంలో నిర్వహించిన గ్రామసభలో పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పాల్గొని ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో అంతర్గత రోడ్లు, డ్రైన్ సౌకర్యంలేక ఇబ్బంది పడుతున్నామని, గ్రామానికి వచ్చే మూడు జడ్పీ రోడ్లు గుంతల మయంగా ఉన్న నేపథ్యంలో ద్విచక్రవాహనం కూడా నడిపే వీలులేకుండా పోయిందని , కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలని స్థానికులు ఎమ్మెల్యే దష్టికి తీసుకువచ్చారు. రూ.40లక్షలతో గ్రామంలో అంతర్గత రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులు చేపడతారని ఎమ్మె ల్యే హామీ ఇచ్చారు. ఇళ్ల మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. గ్రామసర్పంచ్ షేక్ జానాబాష, మ ండల పార్టీ అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బంటుమిల్లి : బంటుమిల్లి మండలంలో నాగేశ్వరావుపేటలో పెడన నియోజకవర్గ ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలను ఎంఎల్‌ఎకు విన్నవించుకున్నారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరిస్తానని వినతులు ఇచ్చిన వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పంచకర్ల సురేష్, కూనపు రెడ్డి వీరబాబు, ఒడుగు తులసిరావు పాల్గొన్నారు.



సాయిపురంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ బోడేప్రసాద్



బంటుమిల్లి మండలంలో అర్జీలు స్వీకరిస్తున్న ఎంఎల్‌ఎ

అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్లు స్వాధీనం



ప్రజాశక్తి-పమిడిముక్కల : మండల పరిధిలోని మేడూరు డొంకరోడ్డు వద్ద ఐలూరు నుండి ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్ లారీలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి పమిడిముక్కల తహశీల్దార్‌కు అప్పగించినట్లు ఎస్ఐ బి.శ్రీను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఇసుక అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలు పోలీస్‌లకు తెలియజేయాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.



కంఠాభరణాన్ని ఆలయ ఈవో శ్రీనివాస్‌కు అందజేస్తున్న దృశ్యం

కంఠాభరణం బహూకరణ

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలో ఉన్న రాజరాజేశ్వరి సమేత రాజశేఖర్ స్వామి వారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అవనిగడ్డకు చెందిన ప్రముఖ న్యాయవాది వల్లభనేని రామారావు, కష్ణకుమారి దంపతులు అమ్మవారికి రూ 1,12,900 విలువైన బంగారు కంఠాభరణాన్ని సమర్పించారు. శనివారం ఉదయం రామారావు దంపతులు ఈ ఆభరణాన్ని ఆలయ కార్య నిర్వహణ అధికారి యార్లగడ్డ శ్రీనివాస్కు అందజేయగా వేద పండితులు అమ్మవారికి ఆభరణాన్ని అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివద్ధి కమిటీ చైర్మన్ సింహాద్రి రామనాథం బాబు, ఆలయ పురోహితులు సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సి.ఎల్ వెంకటరావు ఆధ్వర్యంలో గుడ్లవల్లేరు లోని జన్మభూమి మెడికల్ క్యాంపులో శనివారం వందలాది మంది రోగులకు వివిధ రుగ్మతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఏలూరు సెయింట్ జోసెఫ్ డెంటల్ వారి వైద్యులు రోగులకు దంత వైద్య పరీక్షలు చేశారు. విజయవాడ సివిఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారి వైద్యులు రోగులకు గుండె పరీక్షలు చేశారు. అవసరమైన రోగులకు ఉచిత మందులు పంపిణీ చేశారు. అలాగే ఆదివారం విజయ వాడ కామినేని హాస్పిటల్ వారు, హెూమియో వైద్యులు, ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వారు తమ వైద్య శిబిరంలో వైద్య సేవలు అందించనున్నారని డాక్టర్ సి ఎల్ వెంకటరావు పేర్కొన్నారు.



పురస్కారం అందజేత

ప్రజాశక్తి-ఉంగుటూరు : అంతర్జాతీయ ఉపాధ్యాయ దినో త్సవం సందర్భంగా శనివారం జగ్గయ్యపేట శాసన సభ్యులు శ్రీరామ్ తాత య్య, కృష్ణా గుంటూరు జిల్లాల శాసనమండలి సభ్యులు కెఎస్ లక్ష్మణరావు చేతుల మీదుగా బాపులపాడు మండలం వీరవల్లి విశ్వ భారతి కోచింగ్ సెంటర్ అధినేత సయ్యద్ లాల్ సాహెబ్ కు విశిష్ట విద్య సేవా పరిష్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఏపీ ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ డెమోక్రటిక్ సభ్యులు హాజరయ్యారు.

వరద బాధితులకు అండగా సిపిఎం

వరద బాధితులకు సిపిఎం వెన్నుదన్నుగా నిలిచింది. వేసవి కాలాన్ని తలపించేలా మండే ఎండను సైతం లెక్క చేయకుండా వరద బాధితులను కలుపుకొని గురువారం ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు జిల్లా కలెక్టరేట్ వద్ద నడి రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. వరద బాధితులందరినీ సమగ్రంగా గుర్తించి, ప్రతి ఒక్కరికీ పరిహారం అందించాలని, పరిహారం పెంచాలని వరద బాధితులతో పాటు ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు చేసిన నినాదాలు హోరెత్తాయి. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు, జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ, రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, కె.శ్రీదేవి, ఇతర నాయకులు, కార్యకర్తలు, వందలాది మంది వరద బాధితులు పెద్దఎత్తున పాల్గొని ఆందోళన నిర్వహించి, వరద బాధితుల ఆవేదనను, ఆందోళనను ప్రభుత్వం, అధికారులు ఆలకించేలా ఉద్యమాన్ని నిర్వహించారు. ఈ ఆందోళనలో సింగ్‌నగర్‌లోని డాబాకొట్లు సెంటర్, పైపుల రోడ్డు, కండ్రిక, ఎల్‌బిఎస్ నగర్, ప్రకాష్‌నగర్, ఆర్ఆర్‌పేట, శాంతినగర్, రాధానగర్, రాజీవ్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన వరద బాధితులు ధర్నాలో పాల్గొని విజయవంతం చేశారు. వరద బాధితులు ఎక్కడ కలెక్టరేట్‌లోకి వచ్చి ఆందోళన చేస్తారోననే భయాందోళనతో కలెక్టరేట్‌కున్న రెండు ప్రధాన గేట్లను సైతం మూసి వేయించి, పోలీసు బలగాలను కాపలా ఉంచడంతో పాటు ధర్నా వద్ద కూడా పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు. బ్యానర్ చేబూని ఒక వైపున నినాదాల హోరు మరొక వైపున నాయకులు

వీక్షణం

ప్రసంగాలు, ధర్నా చెంతకు క్రమంగా పెరుగుతున్న వరద బాధితులను గమనిస్తున్న పోలీసు అధికారులు దేనికైనా మంచిదనే రీతిలో ఏకంగా డిఆర్ఒ శ్రీనివాసరావును ధర్నా వద్దకు తీసుకొచ్చి బాధితుల దగ్గర నుంచి వేలాది అర్జీలను ఇప్పించక తప్పలేదు. వరద బాధితుల కష్ట-నష్టాలను ప్రభుత్వానికి తెలియ జేయడంతోపాటు పరిహారం మంజూరు అయ్యి, ఇంకా వారి వారి అకౌంట్‌కు జమ కాలేదో అటువంటి వాటిని పరిష్కరించడం జరుగుతుందని డిఆర్ఒ, నేతలకు హామీనివ్వక తప్పలేదు. సిపిఎం ఆందోళనతో అటు అధికారులు, ఇటు ప్రభుత్వంలో కొంత కదిలిక వచ్చి ప్రతి ఒక్కరి నుంచి అర్జీలు తీసుకోవాలనే నిర్ణయానికి అధికారులు వచ్చారు. గత నెల మొదటి తేదీన వచ్చిన వరదల సమయంలో సింగ్‌నగర్‌లోని పలు డివిజన్లలో సిపిఎంకు చెందిన అనేక కుటుంబాలు వరదల్లో చిక్కుకొని సర్వం కోల్పోయి, తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ సిపిఎం ఇచ్చిన పిలుపునందుకొని బుడమేరు వరదలో చిక్కుకున్న వృద్దులు, పసిపిల్లలు, మహిళలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సంఘాల నేతలు, కార్యకర్తలు ప్రాణాలకు సైతం వెనుకంజ వేయకుండా పడవులు, ఇతర మార్గాల ద్వారా ప్రజలను రక్షించడం, అలాగే అధికారులు, ప్రభుత్వాన్ని సైతం వివిధ రూపాల్లో అప్రమత్తం చేయించడం తెలిసిందే. వరద నీరు బయటకుపోయి, రోడ్లపై, ఇళ్లల్లో, వాటి చుట్టుపక్కల మేటవేసిన బురద, ఇతర వ్యర్థాలు మురుగుకంపు కొడ్తున్నా కూడా ఎక్కడికక్కడ తొలగించి, శానిటేషన్ పని చేసి అందరిచేత శభాష్ అనిపిం చుకోవడంతో పాటు ప్రభుత్వాన్ని సైతం కదిలించారు. బాధితులకు తామున్నామని సిపిఎం పెద్ద ఎత్తున భోజ నం కేంద్రాలను ప్రారంబించి, సుమారు లక్షా 75 వేల మందికి కోటిన్నర ఖర్చుతో 10 రోజులకు పైగా భోజనం సదుపాయం కల్పించింది. సిఐటియు నేతృ త్వంలో కూడా మూడు రోజుల పాటు వేలాది మందికి భోజనం సదుపాయం కల్పించారు. నెలా పది రోజులు బాధితులకు సిపిఎం అండగా నడిచిందని చెప్పక తప్పదు.

- రాజు



నిస్సాన్ మాగ్నెట్ - 2024 కారు విడుదల

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : నగర మార్కెట్లోకి కొత్త నిస్సాన్ 2024 వెర్షన్ మాగ్నెట్ సరికొత్త కారును బెంజిసర్కిల్ వద్ద గల ఎక్స్‌ప్రెస్ నిస్సాన్ షోరూమ్‌లో శనివారం ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పాములపాటి సుధీర్ మాట్లాడుతూ నిస్సాన్ మాగ్నెట్ 2024 వెర్షన్ కారు ఎక్స్‌షోరూమ్ ధర రూ.5.99 లక్షలుగా నిర్ణయించినట్లు తెలిపారు. కొత్త మోడల్‌లో విసియా, విసియా ప్లస్, యాసెంటా, ఎన్‌కనెక్టా, టెక్నా, టక్నా ప్లస్ వేరియంట్లలో లభిస్తుందన్నారు. ఇందులో అమర్చిన 1.0 లీటర్ టర్బోచార్జ్‌డ్ పెట్రోల్ ఇంజన్ 98 బీహెచ్‌పీ, 160 ఎన్ఎం టార్క్‌ను అందిస్తుందన్నారు. 5 స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషణ్ లేదనా సీవీటీ గేర్ బాక్స్‌ల్లో ఈకారు లభిస్తుందన్నారు. 6 ఎయిర్‌భ్యాగ్స్, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, హిల్‌స్టార్ట్ అసిస్ట్, టైర్ ప్రెజర్ మానిటరింగ్ వ్యవస్థ ఉందన్నారను. ఈడీడీతో కూడిన ఏబీయస్ ట్రాక్షన్ కంట్రోల్ వంటి భద్రతా ఫీచర్లు ఇందులో ఉన్నాయని తెలిపారు. మునపటి మోడల్‌కు కొత్త వెర్షన్‌కు ధరలో మార్పులు చేయలేదన్నారు. బుకింగ్ కొరకు 9121 144 848ఫోన్ నెంబరు ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు. తక్షణమమే డెలివరీ సౌకర్యం ఉందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎస్‌బిఐ రీజనల్ మేనేజర్ సుబ్బారావు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రామకృష్ణ, నిస్సాన్ ఏరియా సర్వీస్ మేనేజర్ కోటేశ్వరరావు, షోరూమ్ మేనేజింగ్ డైరెక్టర్ పాములపాటి సుధీర్, జనరల్ మేనేజర్ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవి అలంకారంలో దుర్గమ్మ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మూడోరోజు శనివారం శ్రీ అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. సకల జీవులకు అన్నం ప్రసాదించే దేవత అన్నపూర్ణాదేవి. అన్నం పరబ్రహ్మ స్వరూపం. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు మూడవరోజు శనివారం తెల్లవారుజాము 4 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు అమ్మవారి దర్శనం కల్పించనున్నారు. నేడు అన్నపూర్ణాదేవి అలంకారంలో దుర్గమ్మను దర్శించుకునేందుకు సుమారుగా 80 వేల మంది యాత్రికులు వచ్చినట్లుగా దేవాలయ అధికారులు చెబుతున్నారు. ఉచిత క్యూలైను ద్వారా యాత్రికులు ఎక్కువమంది దర్శనం చేసుకున్నారు. రూ.500ల క్యూ లైనులో యాత్రికులు అధిక సంఖ్యలో వచ్చి దుర్గమ్మను దర్శించుకుంటున్నారు. మహామండపం ఆరవ అంతస్తులోని పలు కార్యక్రమాల్లో యాత్రికులు పాల్గొన్నారు.

బంగారు మంగళ సూత్రాలు, వెండి నెమలి బహూకరణ

ప్రకాశం జిల్లా కొండేపి పట్టణానికి చెందిన ఒక సామాన్య చిరు వ్యాపారి అంకురయ్య అనే యాత్రికుడు మూడో రోజు శనివారం అన్నపూర్ణాదేవి అలంకారంణలో దుర్గమ్మను దర్శించుకుని, బంగారు మంగళ సూత్రాలు బహూకరించాడు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె. ఎస్. రామారావు దాతను అభినందించారు.

నిలువు దోపిడీ : విజయవాడ ఇంద్రకీలాద్రి కొండపై దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు శనివారం మూడవ రోజుకు చేరుకున్నాయి. ఈ నేపధ్యంలో శనివారం భక్తుల వద్ద నుండి వ్యాపారస్తులు నిలువు దోపిడీకి పాల్పడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే పద్మావతి ఘాట్ సమీపంలో గల శనీశ్వర స్వామి దేవాలయం వద్ద గల ఓ వ్యాపారి దీపారాధనకు వాడుకునే నువ్వల నూనె అర లీటర్ బాటిల్‌ను అధిక ధరకు అమ్ముతూ యాత్రికులు, సందర్శకుల నుండి అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. బాటిల్ మీద ఎంఆర్‌పి రూ.110 ఉంటే దానికంటే అధికంగా అమ్ముతూ యాత్రికులను దోపిడీకి గురిచేస్తున్నారని వాపోతున్నారు. రూ.65లు ఉండే ఈ ఆయిల్ బాటిల్‌ను రూ.120లకు అమ్మడంపై ఆశ్చర్యపోతున్నారు. శనీశ్వరస్వామి దేవాలయం అధికారులు పట్టించుకోకపోవటంపై మండిపడుతున్నారు. సంబంధిత ఆలయ ఇఓ, అధికారులతో పాటు ప్రభుత్వానికి చెందిన ధరల నియంత్రణ అధికారులు దృష్టి సారించి అధిక ధరలకు అమ్మకుండా నివారించాలని కోరుతున్నారు.

నేడు శ్రీ లలితా త్రిపురసుందరీ దేవి అలంకారంలో దుర్గమ్మ

దసరా ఉత్సవాలు నాల్గవ రోజు 6వ తేదీ ఆదివారం శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారంలో దుర్గమ్మ భక్తులకు దర్శనమివ్వనున్నారు. శ్రీ లక్ష్మీదేవి, శ్రీ సరస్వతీదేవి ఇరువైపులా వింజామరలతో సేవిస్తూ ఉండగా చిరుమందహాసంతో, వాత్సల్య రూపిణిగా చెరకు గడను చేతపట్టుకొని శ్రీ లలితా త్రిపురసుందరీ దేవిగా యాత్రికులకు దర్శనమివ్వనుంది.

విధుల్లో వున్న దుర్గగుడి ఉద్యోగుల పట్ల పోలీసుల ఓవరాక్షన్

విధుల్లో వున్న దుర్గగుడి ఉద్యోగులు, పలువురు అర్చకులు ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది పోలీసు అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ వారిని అడ్డుకుంటున్నారు. గుడి ప్రాంతంలో బయటకు, లోపలకు తిరగాల్సి వస్తుందని, తమకు దేవాలయం ఇచ్చిన ఐడీ కార్డు, డ్రస్ కోడ్ వున్నా పోలీసులు ఆపివేయటంపై వారు మండిపడుతున్నారు. శనివారం కూడా ఇదే పరిస్థితి చోటుచేసుకోవటంతో దుర్గగుడి ఉద్యోగులు పోలీసులకు నచ్చచెబితే గానీ వారు లోపలకు పంపని పరిస్థితి నెలకొంది. డ్యూటీలు చేస్తున్న ఉద్యోగులు, అర్చకుల పట్ల పోలీస్ అధికారుల తీరు మార్చుకోవాలని కోరుతున్నారు. పోలీసులు బుక్‌లో మరీ రాసుకుని వారిని పంపటంపై ఉద్యోగులు నివ్వెర పోతున్నారు. ఉత్సవాలు మూడో రోజునే ఈ పరిస్థితి ఉంటే మరో తొమ్మిది రోజుల ఉత్సవాల్లో మరెన్ని ఇబ్బందులు పడాల్సి వస్తుందోనని అంటున్నారు.





శ్రీ గాయత్రి దేవిగా మహాలక్ష్మి అమ్మవారు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : స్థానిక చిట్టినగర్‌లోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో జరుగుతున్న దసరా మహోత్సవాల్లో భాగంగా మూడోరోజు శనివారం శ్రీ గాయత్రి దేవి అలంకారంతో యాత్రికులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా శ్రీ నగరాల సీతారామస్వామి శ్రీ మహాలక్ష్మీ అమ్మవార్ల దేవస్థానం కమిటీ అధ్యక్షులు లింగిపిల్లి అప్పారావు, కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు (పి.సి.), గౌరవాధ్యక్షులు బెవర సూర్యనారాయణ మాట్లాడుతూ దసరా సందర్భంగా ప్రతి నిత్యం వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుంటున్నట్లు వివరించారు. దేవస్థానంలో దసరా సందర్భంగా ప్రతిరోజు సాయంత్రం వేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఆయా కార్యక్రమాలకు యాత్రికుల నుంచి విశేష స్పందన లభిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ ఉపాధ్యక్షులు బెవర శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శులు పొట్నూరి దుర్గాప్రసాద్ (రాజా), శీరం వెంకట్రావు, కార్యవర్గ సభ్యులు మజ్జి ఈశ్వరరావు, తొత్తడి భరత్‌కుమార్, పోతిన సాంబశివరావు, భోగవల్లి శ్రీధర్ , ముదిలి గణేష్, బంక హనుమంతరావు, ఈది ఎల్లా రాజారావు, పిళ్లా విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కొల్లు రవీంద్రకు ఆహ్వానం

స్థానిక చిట్టినగర్‌లోని శ్రీనగరాల సీతారామస్వామి శ్రీ మహాలక్ష్మీ అమ్మవార్ల దేవస్థానంలో జరుగుతున్న దసరా నవరాత్రి ఉత్సవములకు విచ్చేసి శ్రీ అమ్మవారిని దర్శించి శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి అనుగ్రహము పొందవలసిందిగా మంత్రి కొల్లు రవీంద్రని దేవస్థాన అధ్యక్ష కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు మరుపిళ్ల తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సమస్య పరిష్కరించాలని ఆటో డ్రైవర్ల ధర్నా



తాడుతో ఆటోను లాగుతున్న కార్మికులు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : మచిలీపట్నంలో సీఎన్జీ గ్యాస్ కొరతను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి సిఎన్ జి ఆటో కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని కృష్ణాజిల్లా ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మగ్రాపు. పోలినాయుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మచిలీ పట్నంలో సిఎన్జి గ్యాస్ గ్యాస్ కొరత, ఆటో కార్మికులసమస్యను పరిష్కరించాలని కోరుతూ కష్ణాజిల్లా ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మచిలీపట్నం బైపాస్ లో ఉన్న సీఎన్జీ గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎం. పోలినాయుడు మాట్లాడుతూ మచిలీపట్నంలో సిఎన్జి గ్యాస్ ఆటో కార్మికులు సుమారుగా 500 మంది కుటుంబాలు జీవనం సాగిస్తున్నారని, మచిలీపట్నంలో సిఎన్జి గ్యాస్ గత రెండు రోజులుగా లేకపోవటం వలన, మరో నాలుగు రోజుల వరకు గ్యాస్ అందుబాటులో ఉండదని కార్మికులు ఆందోళన చెందుతున్నారన్నారు. కష్ణా జిల్లా ముఖ్య పట్నం అయిన మచిలీపట్నంలో ఒకే ఫిల్లింగ్ స్టేషన్ ఉండటంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యను అధికారులు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఆటోలను తాళ్ళాతో కట్టి లాగి నిరసన తెలిపారు ఈ కార్యక్రమంలో సిఐటియు కష్ణాజిల్లా కోశాధికారి బూర. సుబ్రహ్మణ్యం, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు కరీముల్లా, వెంకటేశ్వరరావు, భాష, తదితరులు ఆటో కార్మికులు పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

గాయత్రిదేవి అలంకారంలో దర్శనం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : జిల్లాలో ప్రసిద్ధి గాంచిన శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానం వద్ద జరుగుతున్న దసరా ఉత్సవాల్లో భాగంగా శనివారం శ్రీ గాయత్రి దేవి అలంకారంతో కొండలమ్మ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి సహస్రనామ కుంకుమార్చన, శ్రీ గాయత్రి మూలమంత్ర హవనవం, సర్వ శ్రేయస్సు కలుగు శ్రీ గాయత్రి హెూమాన్ని నిర్వహించారు. అనంతరం శ్రీ వేణుగోపాల భక్త జ్ఞానం బందం వడ్లమన్నాడు భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ మహాలక్ష్మి భక్త మహిళా సమాజం భోగిరెడ్డిపల్లి వారిచే భజన కార్యక్రమం, సాయంత్రం నటరాజ కళాశాల గుడివాడ బి హెచ్ వి ఎస్ ఆర్ శర్మ శిష్య బందం వారిచే కూచిపూడి నత్యం ప్రదర్శించగా రాత్రి 9 గంటలకు శ్రీ విజయ నాటక మండలి, అవనిగడ్డ వారిచే ముచ్చటగా మూడు పౌరాణిక రత్నాలు శ్రీ రామాంజనేయ యుద్ధం, సత్య హరిచంద్ర (కాటిసీను) (ఏకపాత్ర) గాయో పాఖ్యానం (వార్ సీన్) నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు పర్యవేక్షించారు.

ఉప్పలమ్మ తల్లిని దర్శించుకున్న సినీ నిర్మాత : గుడ్లవల్లేరులో శ్రీ ఉప్పలమ్మ తల్లి అమ్మవారిని చిరంజీవి క్రియేషన్స్ అధినేత, సినీ నిర్మాత చల్లపల్లి అమర్ ప్రసాద్ శనివారం దర్శించుకున్నారు. ఆయన ఉప్పలమ్మతో పాటు ఎల్లమ్మ అమ్మవారికి పూలమాలలు వేసి, ప్రత్యేక పూజలను చేసి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయవాడ : రాయల్ సర్వీస్ ట్రస్ట్ ద్వారా 2024-25 విద్యా సంవత్సరానికి ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంతో వారికి మెరిట్ స్కాలర్షిప్సులు అందిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షులు శీతాళం రాంబాబు పేర్కొన్నారు. అర్హులైన పోస్ట్‌మెట్రిక్ విద్యార్థులు తమ దరఖాస్తులను ఈనెల 30వ తేదీలోపు స్వయంగా గానీ, పోస్ట్ ద్వారా గాని పంపాలన్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తామన్నారు. దరఖాస్తులను ఎస్. రాంబాబు, 64-8-10/2 ప్లాన్ నెంబర్ 2ఎ, శ్రీసూర్య పార్క్ వ్యూ, పటమటలంక, విజయవాడ-10కు పంపించాలన్నారు. గడువు తర్వాత వచ్చిన దరఖాస్తులు పరిశీలించబడవన్నారు.



మాట్లాడుతున్న సర్పంచి, కార్యదర్శి

ముస్తాబాద పంచాయతీలో ఎలాంటి అవకతవకలు జరగలేదు

- సర్పంచ్ వేము రాధాకృష్ణ, కార్యదర్శి కలపాల లక్ష్మి

ప్రజాశక్తి-గన్నవరం : ఇటీవల కాలంలో ముస్తాబాద్ గ్రామ పంచాయతీలో అవకతవకలు జరిగాయని పత్రికల్లో (ప్రజాశక్తి కాదు) వచ్చిన నిరాధార ఆరోపణలు చేయడాన్ని సర్పంచ్ వేము రాధా కృష్ణ, కార్యదర్శి కలపాల లక్ష్మి ఖండించారు. శనివారం పంచాయతీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ వెదురుపావులూరు లోని ఒక ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం కు, సరిహద్దులోని ప్రైవేట్ స్థలం వారికి వచ్చిన సరిహద్దు సమస్య ను పంచాయతీ కి ఆపదించటం సరికాదన్నారు. వేము విజయ్ కుమార్ పైన కావాలనే కొంతమంది వ్యక్తులు నిందలు వేస్తూ ఆనందం పొందు తున్నారని చెప్పారు. ఉద్యోగ విరమణ తరువాత ప్రజా సేవ కోసమే రాజకీయాలలోకి వచ్చానని, నాకు ఎటువంటి ధనాపేక్ష లేదని రాధాకృష్ణ తెలిపారు. ఎన్ని కల్లో నేను ఎంత నష్టపోయానో అందరికి తెలుసునని, ఇంకో సారి అసత్య ఆరోపణలు చేస్తే ప్రైవేట్ కేసు, పరువు నష్టం దావ వేస్తానని హెచ్చరించారు. కార్యదర్శి లక్ష్మి మాట్లాడుతూ నా దష్టిలో ఈ సమస్య అసలు పెట్టలేదని, ఆ స్కూల్ రోడ్ వారి సొంత నిధులతో నిర్మాణం చేసుకున్నారని అందరికి తెలుసు అన్నారు. గత మూడు సంవత్సరాలు నుండి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం ఎక్కడ చేయలేదని, అటువంటిది ఆ రోడ్ నిర్మాణం పైన ఐదు లక్షలు బిల్లులు పెట్టామని అసత్య ఆరోపణలు చేయడాన్ని తప్పు పట్టారు. అవసరం అయితే ఏ విచారణ కయినా సిద్ధమే అని చెప్పారు.

బందరును చెత్తరహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యం : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : స్వచ్ఛ మచిలీపట్నంగా తీర్చిదిద్దడంలో ప్రభుత్వానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ శనివారం కలెక్టరేట్లో మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించి, నగరంలో డంపింగ్ యార్డ్ సమస్య, స్టార్మ్ వాటర్ డ్రైనేజ్ సిస్టం ఏర్పాటు గురించి సమీక్షించారు. భారీ వర్షాలు తుఫాను సందర్భాల్లో నగరంలో పలు ప్రాంతాలు ముంపునకు గురై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దీని నివారణకు నగరంలో నాలుగు చోట్ల పంపు హౌసులు (డ్రెయిన్ వాటర్ లిఫ్టింగ్) ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నగరంలో డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతిరోజు నగరంలో సేకరించే చెత్తను తడి చెత్త పొడి చెత్త గా వేరు చేసి ప్రాసెస్ చేసి తడి చెత్త నుండి ఎరువు, పొడి చెత్త ప్లాస్టిక్ వంటి వాటిని రీసైకిలింగ్ చేయడం ద్వారా చెత్త సమస్య పరిష్కారమవుతుందని, తద్వారా నగరపాలక సంస్థకు ఆదాయం సమకూర్తుందన్నారు. ఇందుకోసం నగర సమీపంలో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన భూమిని గుర్తింపు చర్యలు చేపట్టామన్నారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు, జిల్లా పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారి రామకష్ణ, తాసిల్దారు మధుసూదన్ రావు సర్వేయర్ రాజబాబు తదితరులు పాల్గొన్నారు.



సాహితీకి పాన్ ఇండియా ఐకానిక్ అవార్డు

ప్రజాశక్తి-కోడూరు : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారతదేశంలో దాదాపు 16 రాష్ట్రాల్లో స్కూల్, కాలేజీల్లో ఉన్నత విలువలతో విద్యను అందించిన 1000 మంది ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ కు స్థానిక గుంటూరులోని నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్లో అవార్డులు ప్రదానం చేశారు. ఈ అవార్డులలో కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని ఒక ప్రముఖ విద్యా సంస్థలో ఫిజిక్స్ సబ్జెక్టులో అత్యుత్తమ సేవలు అందించినందుకు గాను పాన్ ఇండియా ఐకానిక్ టీచర్ అవార్డు ను కోడూరు మండలం ఉల్లిపాలెం గ్రామానికి చెందిన బడే సాహితీకి అందజేసి ఆమెను ఘనంగా సత్కరించారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అవార్డు గ్రహీత బడే సాహితీ ని ఆర్కే విద్యా సంస్థల చైర్మన్ బండి రామకష్ణ, ప్రిన్సిపల్ శివరామకష్ణ, నారాయణ కళాశాల ప్రిన్సిపల్ ఎన్.సతీష్ పలువురు కోడూరు మండలం అధికారులు రాజకీయ ప్రముఖులు అభినందించారు.



రైతులకు పథకాలు అందేలా కృషి : కలెక్టర్

ప్రజాశక్తి-గూడూరు : జిల్లాలో ఈ- క్రాప్ నూరు శాతం నమోదు చేసి ప్రభుత్వ పరంగా రైతు సంక్షేమ పథకాలు వారికి అందేలా కషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. శనివారం గూడూరు మండలం రామరాజు పాలెం గ్రామ పరిధిలో వ్యవసాయ శాఖ సిబ్బంది నమోదు చేసిన ఈ- క్రాప్ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు.రామరాజుపాలెం గ్రామానికి చెందిన రైతు డొక్కు శివ శంకర వెంకటకష్ణ లక్ష్మీ వరప్రసాద్ పొలంలో సాగు చేస్తున్న వరి పంట కలెక్టర్ పరిశీలించి, ఈ క్రాప్ యాప్ లో రైతు వివరాలు వరి రకం య.1.10 విస్తీర్ణం తదితర వివరాలు పరిశీలించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు ఈ క్రాప్ నమోదు 99 శాతం, ఈ కేవైసీ 89 శాతం పూర్తి చేసినట్లు, నూరు శాతం నమోదు చేయాలని అధికారులను ఆదేశించి నట్లు తెలిపారు. రైతులు తాము పండించిన పంటలు ఈ క్రాప్ లో నమోదు చేసుకుని ఈ కేవైసీ చేయడం ద్వారా రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందటానికి వీలవు తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎన్ పద్మావతి ఏ ఓ శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



ఈక్రాఫ్ పరిశీలిస్తున్న కలెక్టర్ డికె బలాజీ

వరద బాధితులకు విరాళం

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండలం వేల్పూరు గ్రామానికి చెందిన కానూరు శివశంకరరావు విజయవాడ వరద బాధితుల సహాయ నిమిత్తం సిఎం రిలీఫ్ ఫండ్‌కు లక్ష రూపాయలను చెక్కు రూపేనా పోరంకిలోని టిడిపి కార్యాలయంలో పెనమలూరు శాసనసభ్యులు బోడే ప్రసాద్‌కు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా శివశంకరరావును ఎంఎల్ఏ అభినందించారు.





శశికళను సత్కరిస్తున్న దృశ్యం

శశికళకు యుటిఎఫ్ సత్కారం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : యుటిఎఫ్ స్వర్ణోత్సవాలలో భాగంగా లయన్స్ క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు అందిస్తున్న క్లబ్ అధ్యక్షురాలు నిమ్మగడ్డ శశికళను మండల యుటిఎఫ్ సంఘం తరఫున స్థానిక లయన్స్ సేవా భవనంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎల్ నరేంద్ర, మండల అధ్యక్షులు ఎం ఆరోగ్యం, ప్రధాన కార్యదర్శి పి హరి శ్రీనివాస్, లయన్స్ క్లబ్ ప్రముఖులు వైపిసి ప్రసాద్, మాజీ సర్పంచ్ వల్లభనేని వెంకట సుబ్బారావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటం

- అధిక లోడుతో లారీల రాకపోకలు - గాఢ నిద్రలో రవాణా శాఖాధికారులు



అధిక లోడుతో ఉన్న లారీలు

ప్రజాశక్తి - జి.కొండూరు : ఆదాయమే పరమావధిగా కొందరు లారీ యజమానులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. లారీల్లో పరిమితికి మించి అధిక లోడు వేసి రోడ్లపై తిప్పుతున్నారు. ఈ అధికలోడుతో రోడ్లు మొత్తం ధ్వంసం అవుతున్నాయి. సాధారణంగా ఆరు చక్రాల వాహనాలు (టిప్పర్ లారీలు) 10 టన్నుల సామర్థ్యం గల వాహనాల్లో 17 టన్నులు పైగానే లోడ్ వేస్తున్నారు. 18 టన్నుల పరిమాణం గల హైవే లారీలలో 45 టన్నుల పైగానే లోడ్ వేస్తున్నారు. కేవలం కంకర్ లోడ్ లే కాకుండా క్వారీ ప్రాంతంలో ఉండే భారీ బండరాళ్లని కూడా రోడ్లపైకి లారీ క్యాబిన్ హైట్ కంటే భారీగా వేసి ప్రమాదకరంగా నడుపుతున్నారు. ఈ వాహనాలన్నీ జిల్లాలోని ఇబ్రహీంపట్నం, మైలవరం, జి.కొండూరు పోలీస్ స్టేషన్‌ల మీదుగా వెళుతున్న వాటిని నిలువరించే పని రవాణా శాఖ అధికారులదని వాళ్లు కూడా చూసీ చూడనట్లు వదిలేస్తున్నారని కొందరు విమర్శిస్తున్నారు.

కేవలం చిన్న చిన్న ఆటోలు టాటా ఏస్ ట్రాక్టర్ల లాంటి చిన్నాచితక వాహనాలను, నాన్ లోకల్ గూడ్స్ వాహనాలను నిబంధనల పేరుతో తూతూ మంత్రంగా తనిఖీ చేసి చిన్న వాహనాల వద్ద డబ్బులు తీసుకొని వదిలేస్తున్నారు. స్థానికంగా ప్రతిరోజు బండరాలను అధికలోడు వేసే భారీ వాహనాలు మాత్రం చూసిచూనట్లు వదిలేస్తున్నారు. దీనికి కారణం అధికారులు నెలవారి మామూళ్లు లారీ యజమానుల నుండి, క్వారీ యజమానుల వద్ద నుంచి తీసుకుంటున్నారనే గుసగుసలు వినబడుతున్నాయి. రవాణా శాఖ అధికారులు రోడ్లపైకి వస్తున్నారని సమాచారం ముందుగా లారీ యజమానులకు తెలియడంతో వారు ఆ సమయంలో రోడ్లపైకి వాహనాలు రానివ్వకుండా జాగ్రత్త పడుతున్నారు.

ఇబ్రహీంపట్నం మండలం, జి కొండూరు మండల పరిధిలో ఎక్కువ క్వారీలున్నాయి. ఈ ప్రాంతం నుంచి ఏలూరు, కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాలకు కంకరు తరలిస్తుంటారు. పట్టపగలే పరిమితి మించి లోడు ప్రమాదకరంగా వేస్తూ రోడ్డుపైకి వాహనాలు వస్తున్న రవాణా శాఖ అధికారులకు మాత్రం కనబడదు. అసలే గుంతల రోడ్లు... రోడ్డుపై గుంతలో ఉన్న ప్రదేశంలో అధిక లోడుతో వస్తున్న లారీ నుండి ఒక్క బండరాయి ద్విచక్ర వాహన, చోదకులపైన గానీ ఆటోలపైన గానీ పాదచారులపైన గానీ పడితే పరిస్థితి ఏమిటని ప్రజలు వాపోతున్నారు. గత ప్రభుత్వంలోనూ రవాణా శాఖ అధికారుల తీరు ఇదే ప్రభుత్వం మారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రవాణా శాఖ అధికారుల తీరు మారడం లేదు. ఇప్పటికైనా రవాణా శాఖ మంత్రి, ఉన్నతాధికారులు స్పందించి రోడ్లపై అధికలోడు వేసే వాహనాలను నియంత్రించాలని ప్రజలు వాహనదారులు కోరుతున్నారు.

ఎన్‌టిటిపిఎస్‌లో ఇంజినీర్ల బదిలీ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఎన్‌టిటిపిఎస్‌లో ఇంజనీర్ల బదిలీల ప్రక్రియ వేగవంతమైంది. ఎపి జెన్ కో మేనేజింగ్ డైరెక్టర్ చక్రధర్ బాబు ఇప్పటికే 29 మంది ఇంజనీర్లను బదిలీ చేయగా తాజాగా మరో 70 మంది ఇంజనీర్లను బదిలీ చేశారు. బదిలీ అయిన ఇంజనీర్లు తక్షణమే విధుల నుంచి రిలీవ్ కావాలని ఆదేశాలు జారీ చేశారు. విధుల్లో బాధ్యత రాహిత్యంగా వ్యవహరించి యూనిట్లు నిలిచి పోవడానికి కారణమైన అధికారులను జెన్‌కో యాజమాన్యం గుర్తించి చర్యలను ప్రారంభించింది. అందులో భాగంగా ఎపి జెన్ కో ఎమ్‌డి చక్రధర్ బాబు భారీ ప్రక్షాళనకు తెరదీశారు. ఏళ్లతరబడి పాతుకు పోయి నిర్లక్ష్యంగా ఉన్న ఇంజనీర్లపై ఆయన సీరియస్‌గా ఉన్నారు. ఎపి జెన్‌కో ఎమ్‌డి చర్యలతో ఇంజనీర్లు లబోదిబోమంటున్నారు. ఎన్‌టిటిపిఎస్ చరిత్రలో ఇంత భారీ స్థాయిలో వరుస బదిలీలు చేయడం ఇదే ప్రథమం కావడం గమనార్హం. తరువాత యూనియన్‌లో పదవులు అడ్డు పెట్టుకుని విధులకు హాజరుకాని నాయకులపై జెన్ కో అధికారులు చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : సెలవు రోజుల్లో తరగతులను నిర్వహించడాన్ని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది, ప్రభుత్వ నిబంధనలు పాటించని యాజమాన్యంపై జిల్లా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు అన్నారు. నగరంలోని ఎం.బి భవన్ నందు శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం దసరా సెలవులు పాఠశాలలకు ఈ నెల 2 నుంచి, కళాశాలలకు 4 నుంచి ప్రకటించినా యాజమాన్యం మాత్రం ప్రభుత్వం నిబంధనలను పాటించకుండా విద్యార్థులకు సెలవు ఇవ్వడం లేదని అన్నారు. చైతన్య, నారాయణ కార్పొరేటు యాజమాన్యం మాత్రం ప్రభుత్వం నిబంధనలు పట్టనట్లుగా ఇష్టానుసారంగా కళాశాలలు నిర్వహిస్తున్నారని అన్నారు. కళాశాలకు రాకపోతే విద్యార్థుల దగ్గర ఫైన్ రూపంలో వందల రూపాయలు వసూలు చేస్తున్నారని, ఉదయం 8 నుంచి రాత్రి 7 వరకు తరగతులు నిర్వహిస్తూ విద్యార్థిలను అధిక వత్తిడికి గురి చేస్తున్నారని అన్నారు. వెంటనే జిల్లా అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ నాయకత్వం కళాశాలలకు వెళ్లి విద్యార్థులతో ఆందోళ నిర్వహిస్తామని ఆయన అధికారులకు హెచ్చరించారు.

ఎపిటిడిసి చైర్మన్‌గా నూకసాని బాధ్యతలు

ప్రజాశక్తి - విజయవాడ : ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా డాక్టర్ నూకసాని బాలాజీ పదవీ బాధ్యతల స్వీకార కార్యక్రమం శనివారం విజయవాడ ఆటోనగర్‌లోని ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. బాధ్యతలు స్వీకరించిన పిదప ఏపీటీడీసీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ అభిషిక్త్ కిషోర్ ఐఎఎస్ చైర్మన్ కు పుష్పగుచ్చం అందించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, గొట్టిపాటి రవికుమార్ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రివర్యులు, అనగాని సత్యప్రసాద్ రాష్ట్ర రెవెన్యూ స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి, కొల్లు రవీంద్ర రాష్ట్ర ఎక్సైజ్, గనులు, భూగర్భ శాఖ మంత్రి, డాక్టర్ శ్రీ బాల వీరాంజనేయ స్వామి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, విజయవాడ తూర్పు ఎంఎల్ఎ గద్దె, గన్నవరం ఎంఎల్ఎ యార్లగడ్డ వెంకట్రావు, పలువురు ఎంఎల్ఎలు, ప్రముఖులు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ప్రజాశక్తి - విజయవాడ : విద్యార్థులను ఉన్నత లక్ష్యాలతో ముందుండి నడిపించటం ద్వారా వారు భవిష్యత్తులో అన్ని రంగాల్లో రాణిస్తారని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ రెగ్యులరేటర్, మానిటరింగ్ కమిషన్ సిఇఒ డాక్టర్ డి.సూర్యచంద్రరావు అన్నారు. విద్యార్థి వికాస వాహిని-కంకిపాడు ఆధ్వర్యంలో ఆదర్శ అధ్యాపక అవార్డులు-2024 పురస్కారాల ప్రధాన కార్యక్రమం విజయవాడ మహాత్మాగాంధీరోడ్డు (బందరురోడ్డు)లోని ఠాగూర్ గ్రంథాలయంలో శనివారం సాయంత్రం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన సూర్యచంద్రరావు, ప్రపంచ రచయితల సంఘం అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.వి.పూర్ణచంద్ మాట్లాడుతూ దేశంలో భావిభారత పౌరులను అత్యున్నతులుగా తీర్చిదిద్దే అధ్యాపకులు సమాజ నిర్మాణంలో భాగస్వాములన్నారు. వేలాదిమంది విద్యార్థినీ విద్యార్థుల భవిష్యత్తుగా మార్గదర్శులుగా నిలిచిన అధ్యాపకులను సత్కరించుకోవటం ఎంతో ముదావహమన్నారు. డిసెంబర్ 28,29 తేదీల్లో విజయవాడలోని కెబిఎన్ కళాశాలలో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. పౌండర్ వి.కేశవరరావు, ఉపాధ్యక్షులు పాగోలు రాజు, సెక్రటరీ కె.లక్ష్మణరావు మాట్లాడారు.

మంచినీటి సమస్యను పరిష్కరించాలి

సిపిఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు వినతి

ప్రజాశక్తి - విజయవాడ : వన్‌టౌన్‌లోని 50వ డివిజన్‌లోని గొల్లపాలెంగట్టు, మహంతిపురం తదితర ప్రాంతాల్లోని మంచినీటి సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు కోరారు. ఈ మేరకు నగరపాలక సంస్థ చీఫ్ ఇంజినీర్ ఆర్ శ్రీనాథ్‌రెడ్డికి సత్యబాబు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ... 50వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో గత వారం రోజుల నుంచి మంచినీరు సరఫరా కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారన్నారు. ఈ విషయం స్థానిక అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్నారు. నగరపాలక సంస్థకు చెందిన డాక్టర్ కే ఎల్ రావు హెడ్ వాటర్ వర్క్స్ 05ఎం జి డి అండ్ 11ఎం జి డి వాటర్ పంపింగ్ స్టేషన్ నుండి గాంధీ హై స్కూల్ వద్ద రిజర్వాయర్ గాంధీ హిల్ రిజర్వాయర్ గొల్లపాలెం గట్టు రిజర్వాయర్ పూర్తిగా నిండకపోవడం వలన 50డివిజన్ గొల్లపాలెం గట్టు, మహంతిపురం తదితర ప్రాంతాలకు గత వారం రోజుల నుండి మంచినీటి సరఫరా సక్రమంగా జరగడం లేదన్నారు. చీఫ్ ఇంజనీర్ స్పందిస్తూ ఈ సమస్యను వెంటనే పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.


వినతిపత్రం ఇస్తున్న సత్యబాబు

కార్మికుల వేతనాలు చెల్లించాలి: సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు

నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో పని చేస్తున్న శానిటేషన్ కార్మికుల వేతనాలు వెంటనే మంజూరు చేయాలని సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు కోరారు. ఈ మేరకు చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాద్‌రెడ్డికి సత్యబాబు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న కార్మికుల వేతనాలను ఎం/ఎస్ ఆర్కే సర్వీసెస్ ప్రైవేట్ కాంటాక్ట్ సంస్థ వారు గత రెండు నెలల నుండి వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. దసరా పండగ సమయంలో కూడా కార్మికుల వేతనాలు గత రెండు నెలల నుండి చెల్లించకపోవడం వలన కార్మికులు అర్థ ఆకలితో పస్తులు ఉండాల్సి వస్తుందని అన్నారు.



కొనకళ్లను సత్కరించిన బుద్ధా

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఆర్టీసీ చైర్మన్‌గా పదవీబాధ్యతలు స్వీకరించిన కొనకళ్ల నారాయణను టిడిపి నాయకులు, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న శాలువతో సత్కరించి పూలమాలవేశారు. ఎపిఎస్ ఆర్టీసీ చైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కొనకళ్ల నారాయణ ఆధ్వర్యంలో ఆర్టీసీ శరవేగంగా అభివృద్ధి చెందగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం లక్ష్యాలుగా పనిచేస్తోందని బుద్ధా వెంకన్న పేర్కొన్నారు.

సీతారామిరెడ్డికి సత్కారం

ప్రజాశక్తి - గంపలగూడెం : రాష్ట్ర ప్రైవేటు పాఠశాల యాజమాన్యం ఏర్పాటు చేసిన సత్కారాల కార్యక్రమానికి గంపలగూడెం మండలం గొల్లపూడి వివేకానంద విద్యాలయం డైరెక్టర్ బి.సీతారామిరెడ్డి ఎంపికైనారు. ఈ మేరకు ఆదివారం జగ్గయ్యపేటలో ఉన్న బి కన్వెన్షన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు, ఎంఎల్ఎ శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య) సత్కరించారు. తిరువూరు నియోజకవర్గ స్థాయిలో సీతారామిరెడ్డిని ఎంపిక చేయడం పట్ల ఆ పాఠశాల సిబ్బంది వర్షం తెలిపారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భం గా జగ్గయ్యపేట పట్టణంలో కోదాడ రోడ్డులో గల బి కన్వెన్షన్ హాల్‌లో శనివారం ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ డెమోక్రటిక్ ఏర్పాటు చేసిన రాష్ట్ర విశిష్ట విద్య సేవా పురస్కార వేడుకలకు ముఖ్యఅతిథులుగా ఎంఎల్‌సి లక్ష్మణరావు, ఎంఎల్ఎ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పాల్గొన్నారు. భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి విశిష్ట విద్యా సేవ పురస్కారాల గ్రహీతలకు అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడూ సర్వేపల్లి రాధాకష్ణన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.


ఉపాధ్యాయుని సన్మానిస్తున్న లక్ష్మణరావు

ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరణ

ప్రజాశక్తి - కంచికచర్ల : మండల టిడిపి కార్యాలయంలో శనివారం ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ ప్రజా దర్బార్‌లో ఎంఎల్ఎ స్వయంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిగత సమస్యలతో పాటు తమ ప్రాంతంలో రోడ్లు, డ్రెయినేజీ సౌకర్యం కల్పించాలని పలువురు కోరారు. మంచినీటి కుళాయిల ద్వారా కొన్ని ప్రాంతాల్లో తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని, అన్ని వార్డుల్లో శివారు కాలనీలకు సైతం కుళాయిల ద్వారా తాగునీరు అందించాలని వినతిపత్రం అందజేశారు. కంచికచర్ల పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో గల నగల షాపులో చోరీ జరిగి లక్షలాది రూపాయల నగదు, నగలు అపహరించుకు పోయిన కేసు 6 నెలలు కావస్తున్నా, నిందితులను గుర్తించటంలో పోలీసు విచారణ ముందుకు సాగలేదని బాధితుడు ఎంఎల్ఎకు మొర పెట్టుకున్నాడు. దీనికి స్పందించిన ఆమె పోలీసు ఉన్నతాధికారులను పిలిచి కేసు విచారణ వేగవంతం చేసి నిందితులను గుర్తించి, చోరీకి గురైన సొమ్మును రికవరీ చేయాలని ఆదేశించారు. కంచికచర్లలో పెసలు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని పలువురు రైతులు అర్జీ అందజేశారు.



ప్రజాశక్తి
జిల్లా వార్తలు 7
ఆదివారం 6 అక్టోబర్ 2024

గ్రామాల్లో బెల్ట్‌షాపుల జోరు

ప్రజాశక్తి-గన్నవరం : ప్రభుత్వం మారినా గ్రామాల్లో ఇంటింటా మద్యాన్ని ఏరులైపారిస్తోంది. దీనిని మేధావులు, విద్యావంతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు, విజయవాడ రూరల్ మండలాల్లో ప్రతి గ్రామంలోనూ వీధికో బెల్టు షాపు నడుస్తున్న విషయం అందరికీ తెలిసిన విషయమే. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు మద్యం అమ్మకాలకు బారులు తెరిచారనే విమర్శలున్నాయి. అవి లేనిచోట బెల్టులకు ద్వారాలు తెరిచారని అంటున్నారు. ప్రస్తుతం మద్యం షాపులు ఊళ్లకు దూరంగా కొత్త ప్రదేశాల్లో ఏర్పాటు చేయడంతో మందు అందరికీ అందుబాటులో ఉండటం లేదు. ఈ నేపథ్యంలో బెల్టులకు గిరాకీ పెరిగిపోయింది. గ్రామాల్లో ఒక టికి నాలుగు బెల్టులు పెట్టుకుని విక్రయలు చేస్తున్నారు. మందు బాబులు పూటు గా తాగి హడావుడి చేస్తున్నారు. కొత్త నిబంధనలతో మద్యం షాపులు దూరమవు తాయని మందుబాబులు ఆందోళన చెందిన వీధికో బెల్టు ఉండటంతో ఆనందం గా ఉంటున్నారు. పగలు కష్టపడి సంపాదించిన సొమ్మంతా మందుకే ఖర్చు చేస్తున్నారని మహిళలు చెబుతున్నారు. బెల్టులతో మరింత ఇబ్బందిగా ఉందని వాపోతున్నారు.



మండలంలోని ముస్తాబాద, సూరంపల్లి, పురుషోత్తపట్నం, కొండపా వులూరు, గోపవరపుగూడెం, చిక్కవరం, కొత్తగూడెం, తెంపల్లి, చిన ఆవుటపల్లి , అల్లాపురం, బుద్ధవరం, అజ్జంపూడి, విఎన్ పురం, చెంచులకాలనీ, గన్నవరం, మర్లపాలెంతోపాటు ఉంగుటూరు మండలంలోని 27 గ్రామాల్లో, బాపులపాడు వ ఎండలంలోని 34 గ్రామాల్లో, విజయవాడ రూరల్ మండలంలోని ఏడు గ్రామాల్లో బెల్టులు వీధికోకటి ఏర్పాటయ్యాయని స్థానికులు చెబుతున్నారు. ఒక్కో మండల లో షాపులకంటే బెల్టుల్లో ఆదాయం బాగుందనే వాదనుంది. ఊరి జనాభాను బట్టి బెల్టు లు నడుస్తున్నాయి. ఆదాయం ఎక్కువగా ఉండటంతో వాటిని ఏర్పాట చేసేందుకు కొందరు పోటీ పడుతున్నారు. రాజకీయంగా అధికారులపై వత్తిడి చేస్తున్న పరిస్థితి కూడా లేకపోలేదు. అధికారులు బెల్టుల నియంత్ర ణకు వెళితే రాజకీయ వత్తిళ్లతో వెనక్కి వచ్చేస్తున్నారు. ప్రధాన కూడలి ఏరియాల ల్లో పగలు, రాత్రి తేడాలు లేకుండా షాపుల్లో పెట్టి మందు అమ్మేస్తున్నారని మహి ళలు తెలిపారు.



ప్రమాదంలో కాలిన గేదెలను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ

అగ్నిప్రమాద ప్రాంతం పరిశీలన

ప్రజాశక్తి-పమిడిముక్కల : పమిడిముక్కల మండలం లోని గురజాడ గ్రామంలో అగ్నిప్రమాద బాధితులను ఎంఎల్ఎ వర్ల కుమార్ రాజా శనివారం పరామర్శిం చారు. ఈ ప్రమాదంలో గేదెలు కూడా మంటలకు కాలాయి. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ బాధితులకు ప్రభుత్వం నుండి వచ్చిన ఆర్థిక సాయం వచ్చేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వెలమంచిలి శ్రీధర్, జక్క శ్రీనివాసరావు, కొండేటి సత్యనారాయణ, వీరంకిలాకు పశు వైద్యాధికారి రామ్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాము

నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుడివాడ : ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడంలో సమస్యలు తలెత్తితే పరిష్కారానికి విద్యుత్ అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. శనివారం ఏలూరు రోడ్డులోని ప్రజా వేదికలో విద్యుత్ శాఖలో ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎస్ఇ సత్యానందం, డిఇ జి.బి.శ్రీనివాసరావు, ఏడి గోరంట్ల గోవిందరావులతో ఎమ్మెల్యే రాము పలు అంశాలపై చర్చించారు. ఇటీవల వరదల ప్రభావంతో దెబ్బతిన్న విద్యుత్తు లైన్లు, స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్లకు పూర్తిస్థాయి మరమ్మత్తులు చేయించాలని సూచించారు.

దుప్పట్లు, దోమతెరలు పంపిణీ

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఇటీవల కృష్ణా నదికి సంభవించిన వరదలకు నష్టపోయిన దక్షిణ చిరువోలు లంక పాతూరు ఎస్సీ కాలనీ, అయ్యవారిపాలెం యానాదుల కాలనీ, మేడి లంకలోని బాధితులకు తిరువూరు ఐసిఈఏ ప్రతినిధి కమ్మిలి తారక రామారావు ఆధ్వర్యంలో దుప్పట్లు దోమతెరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచా యతీ సర్పంచ్ సనక సుబ్రహ్మణ్యం, గ్రామ కార్యదర్శి జాహ్నవి, నడకుదురు నరేంద్ర, సనక అచ్యుతరామయ్య, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



దుప్పట్లు దోమతెరలు అందజేస్తున్న ఐసీఈఏ ప్రతినిధి తారక రామారావు



విద్యార్థినికి బహుమతులు అందిస్తున్న దృశ్యం

'శ్రీశ్రీనివాస'లో ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి-ఉయ్యూరు : విద్యార్థుల డ్యాన్సు, ఆటపాటల కేరింతలతో శ్రీశ్రీనివాసా విద్యాసంస్థల ఆవరణ మార్మోగింది. శ్రీశ్రీనివాస కళాశాలలో శనివారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే ఆద్యంతం విద్యార్థులను ఉర్రూతలూగించింది. విద్యాసంస్థల అధిపతులు పరుచూరి శ్రీనివాసరావు, నీలిమ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యతో పాటు ఆటపాటలు, సంస్కృతి సంప్రదాయలు అలవరుచుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాల న్నారు. ఐఐటీ. నీట్‌లలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు.

ఆలయాలు కిటకిట

ప్రజాశక్తి - గుడివాడ : విజయదశమి పండుగను పురస్కరించుకుని దేవి శరన్నవరాత్ర మహోత్సవాలలో భాగంగా 3వ రోజు శనివారం అమ్మవారి దేవాలయాలు భక్తులతో కళకళలాడు తున్నాయి. స్థానిక బంటుమిల్లి రోడ్‌లో వేంచేసియున్న శ్రీ భీమేశ్వరస్వామి వారి దేవస్థానంలోఅమ్మవారు శ్రీలలితా త్రిపుర సుందరీ దేవి అవతారంలో దర్శనమిచ్చారు. కార్యనిర్వ హణాధికారి గోపాలరావు నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అలాగే స్థానిక గౌరీశంకరపురంలో వేంచేసియున్న శ్రీ గౌరీశంకర స్వామి వారి దేవస్థానంలో శ్రీకాశీ అన్నపూర్ణేశ్వరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే వేణుగోపాలస్వామి వారి దేవస్థానంలో శ్రీవైష్ణవి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కెవి గోపాలరావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



లలితా త్రిపుర సుందరీదేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు

గజలక్ష్మీ అలంకారంలో జగదాంబ.

ప్రజాశక్తి ఉయ్యూరు : శ్రీజగదాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారిని గజలక్ష్మిగా అలంకరించారు. వేకువజాము నుంచి భక్తులు తరలివచ్చి గజలక్ష్మి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. ఈసందర్భంగా నిర్వహించిన సామూహిక కుంకుమార్చనలో మహిళలు పాల్గొన్నారు. ఆలయ అధికారి వీడీడీ ప్రసాద్ పర్యవేక్షించారు.

ఉపకరణాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : అర్హులైన విభిన్న ప్రతిభావంతులకు వయో వృద్ధులకు వివిధ రకాలైన ఉపకరణాలు అనగా మూడు చక్రాల సైకిళ్ళు, వీల్ చైర్స్, చంక కర్రలు, వినికిడి యంత్రాలు, ల్యాప్టాప్లు, టచ్ ఫోన్లు మొదలైనవి ఉచితంగా పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతుల వయో వృద్ధుల సహాయ సంచాలకులు బి.కామరాజు తెలిపారు.కావున అర్హత కలిగిన వారు www.apdas-cac.ap.gov.in వెబ్సైట్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. వెబ్ సైట్ నందు దరఖాస్తు చేసుకొని కాపి డౌన్లోడ్ చేసి సదరు కాపీతో సదరం వైద్య ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం/ తెలుపు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, వికలాంగత్వం కనబడునట్లు పూర్తి ఫోటోలు-2 (పాస్ పోర్టు సైజు) సహాయ సంచాలకులు, విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల, వయో వద్ధుల సంక్షేమ శాఖ, జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము, మచిలీపట్నం, కృష్ణాజిల్లా వారికి సమర్పించాలన్నారు. దరఖాస్తులు నేరుగా స్వీకరించబడవన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌పై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-ఉంగుటూరు : రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్, సాఫ్ట్ స్కిల్స్‌పై దృష్టి పెట్టాలని ఐసిటి అకాడమీ రిలేషన్షిప్స్ మేనేజర్ ఎస్ దినకర్‌రెడ్డి అన్నారు. తేలప్రోలు ఉషా రామా ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఐసిటి అకాడమీ, ఇన్ఫోసిస్‌ల సంయుక్త ఆధ్వర్యంలో 20 రోజులు పాటు జరిగిన శిక్షణా కార్యక్రమాలు శనివారం ముగింపు సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన దినకర్ రెడ్డి మాట్లాడారు. ఆర్‌పిఏ ద్వారా సాంకేతిక పరిజ్ఞానంలో మెళకువలు నేర్పించడంతోపాటు సాఫ్ట్ స్కిల్స్ ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించవచ్చన్నారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థులు తమ టెక్నికల్ స్కిల్స్‌తో పాటు సంబంధిత పరిశ్రమ అవసరాలు తెలుసుకొని భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు మెరుగుపరుచుకునే అవకాశం ఉంటుందన్నారు. ఉషా రామా కళాశాల ప్రిన్సిపల్ జీవీకే ఎస్ వి ప్రసాద్, సిఎస్ఈ డిపార్ట్మెంట్ హెచ్ఓడి డాక్టర్ ఎస్ ఎం రాయ్ చౌదరి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దోనేపూడి కాశీనాథ్

రూ. లక్ష వడ్డీ లేని రుణాలివ్వాలి

- రూ. 25 వేల నుంచి 50 వేలకు పరిహారం పెంచాలి
- హాకర్స్ సమావేశంలో యూనియన్ గౌరవాధ్యక్షులు కాశీనాథ్ డిమాండ్

ప్రజాశక్తి - విజయవాడ : వరదల్లో సర్వం కోల్పోయిన హాకర్స్‌ను అన్ని విధాలుగా ఆదుకోవాలని, లేనట్లయితే వారిని కలుపుకొని ఉద్యమించాల్సి వస్తోందని హాకర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్ హెచ్చరించారు. స్థానిక ఎంబివికెలో హాకర్స్ యూనియన్ సమావేశం శనివారం జరిగింది. దీనికి యూనియన్ నగర అధ్యక్షులు బెవర వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కాశీనాథ్ మాట్లాడుతూ...వరదల్లో హాకర్స్ అనేక రూపాల్లో నష్టపోయారని అన్నారు. ఇంట్లో సామానులతో పాటు తోపుడుబండ్లు, ద్విచక్రవాహనాలు, ఇతర అన్ని రకాలుగా నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే వరద బాధితుల ఎన్యుమరేషన్ హేతుబద్ధంగా, పారదర్శకంగా జరగలేదని, అంతా తప్పులు తడకలుగా ఉందని అన్నారు. గత రెండు వారాల నుంచి సింగ్‌నగర్, ఇతర వరద ప్రభావిత ప్రాంతాల బాధిత ప్రజలు వారికి కల్గిన నష్టాన్ని అధికారులకు తెలుపుకోవడానికి జిల్లా కలెక్టరేట్‌కు క్యూ కడుతున్నారని, దీనిని బట్టే అధికారులు, ప్రభుత్వం వైఫల్యం చెందిందని చెప్పవచ్చునని అన్నారు. ఇప్పటికయినా నష్టపోయిన ప్రతి హాకర్‌కు న్యాయం జరిగేటట్లు లక్ష రూపాయలు వడ్డీ లేని రుణాన్ని బ్యాంక్‌ల ద్వారా ఇప్పించడంతో పాటు పరిహారాన్ని రూ. 25 వేల నుంచి 50 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. హాకర్స్‌కు మునిసిపల్, పోలీసుల అధికారుల నుంచి వేదింపులు నిలుపుదల చేయాలని కోరారు. లేనట్లయితే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి సిహెచ్ మురళీ, సిఐటియు సెంట్రల్ సిటీ అధ్యక్షులు కె దుర్గారావు, నాయకులు వైసుబ్బారావు, బాలబొమ్మ లక్ష్మణ, చిరువ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవికి కళాహారతి

ప్రజాశక్తి - విజయవాడ : నవరాత్రి ఉత్సవాలతో శోభాయమానంగా అలంకరించిన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో కళాకారులు తమ నృత్యాలు, సంగీతంతో హారతి పలికారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు నృత్య, సంగీత కళలతో భక్తులను రంజింపజేశారు. అమ్మవారి దర్శనం చేసుకున్న ప్రతి భక్తుడికి ఈ వేదికపై వైభవోపేతంగా జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. ఆధ్యాత్మిక సౌరభాలు గుబాళింప చేసేలా సాగుతున్న ఈ వేదికపై శనివారం ఉదయం 10 గంటలకు శ్రీహరి విఠల భజన మండలి వారి భజనతో ప్రారంభమ య్యాయి. భక్తి రంజనిలో భాగంగా మల్లాది నాగలక్ష్మి కర్ణాటక సంగీతం, నెల్లూరుకు చెందిన సుజాత భక్తి సంగీతం తో భక్తుల్ని పరవశింప చేశారు. వరుసగా మాదిరాజు బృందం కూచిపూడి నృత్యం, ఆకురాతి కోదండరామయ్య భక్తి సంగీతం, భాగవతారిని రూపకుమారి హరికథ, గంగాధర్ ప్రవచనం, రోషిత కూచిపూడి ప్రదర్శన, యల్లాజోస్యుల అనురాధ ఆంధ్ర నాట్యం, సాహితీ అయ్యంగార్ కూచిపూడి నృత్య ప్రదర్శనలు అన్నపూర్ణా దేవికి హారతి పట్టాయి.





బిగ్ భారత్ క్రికెట్ లీగ్ లోగో, పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : బిగ్ భారత్ క్రికెట్ లీగ్ (బి.బి.ఎల్) లోగో అండ్ పోస్టర్‌ను ఎసిఎ అధ్యక్షుడు, ఎంపి కేశినేని శివనాథ్ గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్లో శనివారం ఆవిష్కరించారు. రాష్ట్రంలోని పలు సెక్టార్ల నుంచి ఈ లీగ్‌లో మొత్తం 100 జట్లు పాల్గొంటాయని ఎసిఎ అధ్యక్షుడు, ఎంపి కేశినేని శివనాథ్‌కి బి.బి.ఎల్ ఫౌండర్ చారుణ్య సాయి వివరించారు. ఐపిఎల్ తరహాలో ఈ టోర్నమెంట్‌ను డిసెంబర్ నెలలో విశాఖపట్నంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న అన్ని సెక్టార్ వాళ్లు ఈ లీగ్‌లో పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా ఎసిఎ అధ్యక్షుడు, ఎంపి కేశినేని శివనాథ్ బి.బి.ఎల్ నిర్వాహకులను లీగ్ నిర్వహణ ఎలా ఉంటుందనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బి.బి.ఎల్ కో-ఫౌండర్స్ భరణి, చైతన్య, జశ్వంత్, మనీష్, సెక్రటరీ పాల్గొన్నారు.

టికెట్ల ద్వారా రూ. 45,43,253 ఆదాయం

ప్రజాశక్తి-వన్‌టౌన్:శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా ఉత్సవాల సందర్భంగా మూడో రోజు శనివారం దర్శనం టిక్కెట్లు, ప్రసాదాల అమ్మకం, కుంకుమ పూజలకు సంబంధించి శనివారం సాయంత్రం 5 గంటల వరకూ దేవాలయానికి మొత్తం రూ. 45,43,253లు ఆదాయం లభించింది. రూ. 500 టిక్కెట్లు 3848కు గాను రూ.19,24,000లు, రూ.300ల టిక్కెట్లు 1733కు రూ.5,19,900లు, రూ. 100ల టిక్కెట్లు 4196 కు గాను రూ. 4,19,600లు, లడ్డూ ప్రసాదం ఒకటి రూ. 5ల చొప్పున 12425 లడ్డూలకు రూ.1,86,375లు, ఆరు లడ్డూల ప్రసాదం ప్యాక్ రూ.100ల చొప్పున 53706 లడ్డూలకు గానూ రూ. 8,95,100లు, లడ్డూ ప్రసాదం రూ. 15 చొప్పున 20451లక గానూ రూ.3,06,765, పరోక్ష ప్రత్యేక కుంకుమార్చనకు రూ.3వేలు చొప్పున ఎనిమిది టిక్కెట్లకు గాను రూ,24,000లు, కుంకుమార్చన (సరస్వతి అలంకరణ) రూ. 5000 చొప్పున మూడు టిక్కెట్లకు గానూ రూ.15వేలు, పరోక్ష ప్రత్యేక చండీహోమం రూ.4వేల చొప్పున 13 టిక్కెట్లకు గానూ రూ. 52వేలు పరోక్ష ప్రత్యేక శ్రీచక్ర నవార్చన రూ. 3000 చొప్పున 23 టిక్కెట్లకు గానూ రూ. 69 వేలు, పరోక్ష ప్రత్యేక ఖడ్గమాలార్చన రూ.5,116లు చొప్పున మూడు టిక్కెట్లక గానూ రూ. 15,348, ఫొటోలు, క్యాలెండర్స్‌కు రూ.1,780లు, హుండీ, డొనేషన్ల రూపంలో రూ. 2,17,640లు, కేశఖండన టిక్కెట్ రూ. 40ల చొప్పున 20786 టిక్కెట్లకు గాను రూ. 83,120లు ఆదాయం సమకూరింది. దీంతో మొత్తం రూ.45,43,253లు ఆదాయం సమకూరినట్లు దుర్గగుడి అధికారులు శనివారం విడుదల చేసిన ప్రటకన ద్వారా తెలిపారు.

సిఎన్‌జి బైక్ బజాజ్ ఫ్రీడమ్ 125 ఆవిష్కరణ

ఘనంగా వరుణ్ బజాజ్ 25వ వార్షికోత్సవ వేడుకలు





బైక్‌ను ఆవిష్కరిస్తున్న గద్దె దంపతులు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : వరుణ్ బజాజ్ 25వ వార్షికోత్సవ సంబరాలలో భాగంగా తొలి సిఎన్‌జి బజాజ్ ఫ్రీడమ్ 125 ద్విచక్ర వాహనాన్ని శనివారం మార్కెట్లోకి విడుదల చేశారు. బెంజిసర్కిల్ వద్ద గల లారీ ఓనర్స్ అసోసియేషన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో విజయవాడ తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు గద్దె రామమోహన్, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధలు మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ రామమోహన్ మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా విజయవాడ నగరవాసులతో పాటు ఇతర ప్రాంతాల వారికి వాహనాలను అందించడంతో పాటు అత్యుత్తమ సర్వీస్ అందించడంలో వరుణ్ బబాజ్ అగ్రస్థానంలో ఉందని తెలిపారు. మంచి క్రమశిక్షణ గల సంస్థతో పాటు ఉద్యోగులకు ఎప్పటికపుడు చక్కటి సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. తొలి సిఎన్‌జి బైక్ బజాజ్ ఫ్రీడమ్ ద్విచక్ర వాహనాన్ని తన చేతుల మీదుగా ఆవిష్కరించడం ఆనందంగా ఉందని తెలిపారు. వరుణ్ బజాజ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.వి.సత్యనారాయణ మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా తమను ఆదరిస్తున్న కస్టమర్లకు మిత్రులకు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు. సేల్స్‌లో ఇప్పటివరకు 3.75 లక్షల ద్విచక్ర, త్రిచక్ర వాహనాలను అమ్మకాలు జరిగాయని తెలిపారు. సర్వీసులో 20.5 లక్షల కస్టమర్లకు సేవలను అందించినట్లు తెలిపారు. కస్టమర్లకు చక్కటి సేవలను అందిస్తూ 25 సంవత్సరాలు తమ సంస్థ పూర్తి చేసుకోవడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. తాము ఆవిష్కరించిన బజాజ్ ఫ్రీడమ్ బైక ట్విన్ ట్యాంక్ సెటప్ కలిగిఉంటుందన్నారు. ఒక ట్యాంక్ పెట్రోల్ కొరకు, మరో ట్యాంక్ సిఎన్‌జి కొరకు ప్రత్యేకంగా డిజైన్ చేశారనానద్రు. ఇందులో రెండు రకాల ఫ్యూయల్స్ వాడుకోవచ్చని తెలిపారు. బజాజ్ ఫ్రీడమ్ బైక మూడు రకాల వేరియంట్లలో లభ్యమవుతుదన్నారు. బజాజ్ ఫ్రీడమ్ 125 డ్రమ్ ఎక్స్ షోరూమ్ ధర రు. 95వేలుగా నిర్ణయించినట్లు తెలిపారు. రెండో మిడ రేంజ్ వేరియంట్ డ్రమ్ ఎల్‌ఇడి ఎక్సషోరూమ్ ధర రూ.1.05 లక్షలుగా నిర్ణయించగా, టాప్ ఎండ్ ఫ్రీడమ్ బైక్ ఎక్స్‌షోరూమ్ ధర రు. 1.10 లక్షలుగా నిర్ణయించినట్లు తెలిపారు. వార్షికోత్సవం,. దసరా ఆఫర్లుగా ప్రతి బజాజ్ బైక్ కొనుగోలుపై క్యాబిన్ ట్రాలీ సూట్‌కేసును ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. రూ.5వేల వరకు క్యాష్ ఆఫర్‌ను కూడా అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బజాజ్ ఆటో ఏరియా సేల్స్ మేనేజర్ సాదత్ భాషా, ఎ.ఎస్.ఎం. అశోక్, వరుణ్ బజాజ్ జనరల్ మేనేజర్ పద్మజ పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో 'అమ్రిత సాయి' ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల మండలం పరిటాల పరిధిలోగల అమ్రిత సాయి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో పలు విభాగాలలో నిర్వహించిన క్రీడా పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు కైవసం చేసుకున్నారని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ కె.రామ మోహన్‌రావు తెలిపారు. ఇటీవల మధ్యప్రదేశ్‌లో జరిగిన 9 వ జాతీయ స్థాయి కెనో పోలో ఛాంపియన్ షిప్ లో అమ్రిత సాయి బి.టెక్ రెండవ సంవత్సరం విద్యార్థి కె.విష్ణు ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొని అత్యుత్తమ ప్రదర్శన తో జూనియర్స్ విభాగంలో రెండో స్థానంతో పాటు సిల్వర్ మెడల్, సీనియర్స్ విభాగంలో మూడో స్థానంతో పాటు బ్రాంజ్ మెడల్‌ను కైవసం చేసుకున్నాడు. ప్రిన్సిపాల్ ఎమ్.శశిధర్ మాట్లాడుతూ అన్ని రాష్ట్రాల నుండి విద్యార్థులు ఈ పోటీలలో తలపడ్డారని, ఆంధ్ర ప్రదేశ్ తరపున తమ కళాశాల విద్యార్థి గెలుపొందడంపై హర్షం వ్యక్తం చేశారు. కృష్ణా జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్, విజయవాడ వేదికగా నిర్వహించిన కృష్ణా డిస్ట్రిక్ట్ బాడ్మింటన్ ఛాంపియన్ షిప్ 2024 పోటీల్లో అండర్ - 19 బాడ్మింటన్ డబుల్స్ విభాగంలో అమ్రిత సాయి కళాశాల బి.టెక్ రెండో సంవత్సరం విద్యార్థి షేక్.ఇర్ఫాన్ పాషా ఉత్తమ ప్రదర్శన కనబరిచి రెండో స్థానం కైవసం చేసుకున్నారని తెలిపారు. ఛాంపియన్ షిప్ నిర్వాహకులు గెలుపొందిన విద్యార్థికి ప్రశంసా పత్రం, మొమెంటో అందజేశారు. విజేతలను సెక్రటరీ కరెస్పాండెంట్. రామ్మోహన రావు, ప్రిన్సిపాల్ యమ్.శశిధర్ అకడమిక్ డైరెక్టర్ పి.చిరంజీవి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ ఎం.శ్రీదేవి, ఫీజికల్ డైరెక్టర్స్ పి.శ్రీనివాసరావు, పి.శివ రామకృష్ణ అభినందించారు.